https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్

ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 274 శనివారం 20-12-2025 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# పంచాయితీలకు సెలవ్.. పెట్టండి..

## ఎంపిటిసి,జడ్పీటిసిలకు ప్రిపేర్ కండి..

- గులాబీ జెండాను హత్తుకున్న ప్రజలు
- ఇక అన్ని ఎన్నికల్లో మనమే గెలవాలి
- గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కెటిఆర్



**రాజన్నసిరిసిల్ల,డిసెంబర్19 :** పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం సులభం కానీ.. పంచాయతీ ఎన్నికల్లో గెలవడం కష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ 10 సీట్లు గెలవలేదని.. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ 80 గ్రామాల్లో గెలిచిందని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సమావేశమైన కేటీఆర్.. వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలు అయిపోయాయి కాబట్టి.. పగలు, పంచాయితీలో పక్కనబెట్టి కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల ప్రజలు గులాబీ జెండాను గుండెలను హత్తుకున్నారని కేటీఆర్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కొన్ని చోట్ల రెండు వైపులా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే నిలబడ్డారని తెలిపారు. త్వరలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగబోతున్నా యని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీకి, మండల పరిషత్‌కు అనుసంధానకర్త ఎంపీటీసీ అని కేటీఆర్ తెలిపారు. అలాగే జిల్లా పరిషత్‌కు, మండల పరిషత్‌కు సమన్వయకర్త జడ్పీటీసీ అని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలతో పంచాయితీలు పక్కనపెట్టాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్లలెప్లలెనా డంపింగ్ యార్డులు, ప్రగతి వనాలు ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పల్లెలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు.సిరిసిల్లలో ఉన్న 57 ఎంపీటీసీ స్థానాలు గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అందరూ కలిసి కాంగ్రెస్‌పై కొట్లాడాలన్నారు. గులాబీ గెలుపును చూసి కాంగ్రెస్ పరేషన్ అయితోం దని తెలిపారు. ఓడిపోయిన అభ్యర్థులు కూడా ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీచేయా లన్నారు. పాత తరం నాయకులు, కొత్త తరాన్ని కలుపుకుంటూ ముందుకుపోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అప్పటికప్పుడు మాటలు మారుస్తున్నారని కేటీఆర్ అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మొదట 66 శాతం సర్పంచ్ స్థానాలు గెలిచామని చెప్పారని తెలిపారు. వెంటనే మాటమార్చి స్థానిక ఎన్నికలతో పార్టీకి సంబంధం లేదంటున్నాడని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి లాగే ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా మాటలు మారుస్తున్నారని అన్నారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరానని కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు మాటమార్చి బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెబుతున్నారని తెలిపారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని పరిస్థితిలో కడియం, పోచారం ఉన్నారని విమర్శించారు. గడ్డిపోచలాంటి పదవి కోసం చూరుకు గబ్బిలా ల్లా వేలాడుతున్నారని ఎద్దేవా చేశారు.గెలుపు కోసం కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ప్రజలు మాత్రం బీఆర్ఎస్‌తోనే ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో గులాబీ ప్రభంజనమే అందుకు నిదర్శనమని చెప్పారు. సర్పంచ్ అయినా ఎమ్మెల్యే, ఎంపీలు అయినా ప్రజల కోసమే పనిచేయాలని అన్నారు.



# ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణ

### ఫిల్మ్, టెలివిజన్ ఎకో సిస్టమ్ మరింత అభివృద్ధి
### షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్,డిసెంబర్19:** దేశంలోనే ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణను మార్చాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ఫిల్మ్, టెలివిజన్ ఎకో సిస్టమ్‌ను మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చిత్తశు ద్ధితో పనిచేస్తుందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. సులభంగా, సౌకర్యవంతంగా సినిమాల నిర్మాణానికి తెలంగాణ ఎంతో అనుకూలంగా మారిందన్నారు. సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు సహా పలువురు సినీ ప్రముఖులు, విశ్లేషకులతో కలిసి హైదరాబాద్ ప్రసాద్ ఐమ్యాక్స్‌లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ మొదటి ఎడిషన్‌ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి వెంకట్ రెడ్డి.. ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ - 2025.. మన హైదరాబాద్‌కు, మన తెలంగాణకు ఒక మంచి ఆరంభం అని పేర్కొన్నారు. హైదరాబాద్ అంటేనే సినిమాగా పేరుగాంచింద న్నారు. దేశం నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చి సినిమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. పెద్ద సినిమాలు ఒకవైపు.. షార్ట్ ఫిల్మ్స్ మరోవైపు తీయడం వల్ల హైదరాబాద్ పేరు ప్రఖ్యాతలు మరింత పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. కొత్త టాలెంట్ ఎక్కువగా షార్ట్ ఫిల్మ్స్ నుంచి వస్తోందన్నారు మంత్రి. షార్ట్ ఫిల్మ్స్ యువతకు ఫ్రీడమ్ ఇస్తాయని.. కొత్తగా ఆలోచించడానికి.. కొత్తగా ట్రై చేయడానికి.. తమ కథని తమ స్టైల్‌లో చెప్పడానికి.. అవకాశాన్ని కల్పిస్తాయన్నారు కోమటిరెడ్డి. ఈరోజు పెద్ద స్థాయిలో ఉన్న చాలామంది ఫిల్మ్ మేకర్స్ మొదట షార్ట్ ఫిల్మ్స్‌తోనే మొదలుపెట్టారని గుర్తు చేశారు.

# ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపండి

### కేంద్రాన్ని కోరిక కవిత



**భద్రాద్రి కొత్తగూడెం,డిసెంబర్ 19:** పరిపాలన సౌలభ్యం కోసం ఐదు గ్రామాలను భద్రాచలంలో కలపాలని ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. అలాగే అశ్వరావుపేట పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు వినతి చేశారు. ప్రసాద్ స్కీంలో భద్రాచలం రామాలయానికి రెండు వందల కోట్లు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసులు, గిరిజనుల సంక్షేమం కోసం చేసిన ఖర్చులపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క శ్వేతపత్రం విడుదల చేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. జాగృతిబాటలో భాగంగా ఆమె జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ పాలనలో ఆదివాసులు, గిరిజనులకు ఏం చేశారో వెల్లడించాలన్నారు. సింగరేణి పుట్టినిల్లు ఇల్లందులో కొత్త బొగ్గు బావులు మొదలు పెట్టాలని అన్నారు. సింగరేణి కార్మికులు సంక్షేమం కోసం కాకుండా సీఎం రేవంత్ ఫుట్ బాల్ కోసం పది కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో కొత్తగూడెంకు ప్రాధాన్యం లేదని విమర్శించారు.

# ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట

### పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సులో రాష్ట్రపతి ముర్ము





**హైదరాబాద్,డిసెంబర్19 :** ఉద్యోగ నియామకాల విషయంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు వేగంగా స్పందిస్తున్నా యని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నా. 1950 తర్వాత యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఏర్పాటు మొదలైంది. ఈ విషయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కీలక పాత్ర పోషించారు. నియామకాల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యమి వ్వాలి. ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కారం అవసరం అని రాష్ట్రపతి అన్నారు. నియామకాల్లో పారదర్శకత, ప్రజల్లో విశ్వసనీయత పెంచడంపై దృష్టి సారించాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు.నియామకాల్లో ఎదురవు తున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్క రించాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. 2047 వికసిత భారత్ లక్ష్య సాధనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధితో జగన్‌కు ఎదురుదెబ్బలు

**పిపిపి విధానంపై కోటి సంతకాల పేర డ్రామా**

**కూటమి ఎంపిలో సిఎం చంద్రబాబు వ్యాఖ్య**



**న్యూఢిల్లీ,డిసెంబర్19:** రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాల విషయంలో జగన్ కి ఎదురుదెబ్బలే ఎక్కువగా తగులుతున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. రాష్ట్రానికి చెందిన కూటమి ఎంపీలతో సమావేశమయ్యారు. తెదేపా పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సుమారు 40 నిమిషాల పాటు వివిధ అంశాలపై వారితో మాట్లాడారు. ఒక్క వైద్య కళాశాలల పీపీపీ వ్యవహారం మాత్రమే వైకాపాకు దొరికింది. ఆ విషయంలో కూడా ప్రజలు వాళ్లకి అవకాశం ఇవ్వలేదు. కోటి సంతకాల పేరుతో డ్రామా చేయాలని జగన్ చూశారు. కానీ.. అది కూడా ఫెయిల్ అయ్యింది. ఢిల్లీ స్థాయిలోనూ పీపీపీ విధానంపై ఎంపీలు అధ్యయనం చేయాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో పీపీపీ పద్ధతిలో ఆస్పత్రులు నడుస్తున్న విషయాన్ని పలువురు ఎంపీలు సీఎంకు వివరించారు.

# డీజీపీ సమక్షంలో 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

- ఆయుధాలతో సహా లొంగిపోయిన పీఎల్‌జీఏ, డివిజనల్ స్థాయి నేతలు
- 24 ఆయుధాలు, 733 తూటాలు స్వాధీనం
- పునరావాస విధానం కింద రూ.1.46 కోట్లకు పైగా ప్రోత్సాహకాలు



**హైదరాబాద్, డిసెంబర్ 19 :** నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీకి తెలంగాణలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో మొత్తం 41 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో పీఎల్‌జీఏ బటాలియన్‌తో పాటు డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు కూడా ఉండటం గమనార్హం. ఈ లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలు మరింత బలహీనపడతాయని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ లేదా కంపెనీ కమిటీ సభ్యులు, 12 మంది ఏరియా లేదా ప్లాటూన్ కమిటీ సభ్యులు, 23 మంది సాధారణ పార్టీ సభ్యులు ఉన్నారు. వారి వద్ద నుంచి ఇన్సాస్ ఎల్ఎంజీ, ఏకే-47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిళ్లు, .303 రైఫిళ్లు సహా మొత్తం 24 ఆయుధాలు, 733 తూటాలు, 8 బీజీఎల్ షెల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు తెలంగాణకు చెందినవారుగా అధికారులు తెలిపారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు తమ నిర్ణయానికి గల కారణాలను వెల్లడించారు. పార్టీలో సంస్థాగత బలహీనత, నాయకత్వంపై నమ్మకం తగ్గడం, అడవుల్లో ఎదురవుతున్న తీవ్రమైన జీవన కష్టాలు, భద్రతా బలగాల నిరంతర ఒత్తిడి కారణంగానే హింసను వీడి ప్రధాన జనజీవనంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

# ప్రతి నియోజకవర్గానికి సాగునీరు

- వచ్చే జూన్ నాటికి సీతారామతో నీరు అందిస్తాం - పాలేరుకు గోదావరి జలాలను రప్పించడమే లక్ష్యం
- జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేసే సంకల్పంతో పనులు - మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



**ఖమ్మం,డిసెంబర్19:** ఖమ్మం జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో రాబోయే జూన్ నాటికి 25 వేల ఎకరాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగు నీరు అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. టన్నెల్స్ అన్నింటినీ శరవేగంగా పూర్తి చేసి అన్నదాతలకు సాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పుకొచ్చారు. పాలేరుకు గోదావరి జలాలు వస్తేనే సీతారామ లక్ష్యం పూర్తవుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు తుమ్మల. మరోవైపు స్వామి నారాయణ స్కూల్ నిర్మాణం జరుగుతోందని.. వెలుగుమట్ల అర్బన్ పార్క్ నిర్మాణం పూర్తి చేసి మంచి మ్యూజియం, పార్క్ ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జిల్లాను అన్ని విధాలా నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో జిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి.. ఈ సందర్భంగా కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న పనులను వివరించారు. పర్యాటక ప్రాంతంగా ఖమ్మంను అభివృద్ధి చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు మంత్రి. ప్రపంచస్థాయి డిజైన్‌తో నగరంలో క్రికెట్ స్టేడియం నిర్మాణం చేస్తున్నామని మంత్రి తుమ్మల వెల్లడించారు. సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ పూర్తి కావొచ్చిందని వెల్లడించారు.

# క్రిస్మస్ వేడుకలకు సిఎంకు ఆహ్వానం



**హైదరాబాద్,డిసెంబర్19 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి అజారుద్దీన్, క్రిస్టియన్ మైనారిటీ నేతలు కలిసారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి అజారుద్దీన్, క్రిస్టియన్ మైనారిటీ నేతలు ఆహ్వానం అందించారు. ఏటా ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తోంది. మైనార్టీ శాఖ దీనిని చేపట్టింది.

# సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

**సికింద్రాబాద్, డిసెంబర్ 19**



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని మోండా మార్కెట్‌లో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. మార్కెట్ లోని శ్రీరామ ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. మోండా మార్కెట్ నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ప్రమాద వార్త వేగంగా వ్యాపించి జనాలు ఆందోళనకు గురయ్యారు. అగ్ని ప్రమాదం సమయంలో దట్టమైన పొగలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించాయి. దీంతో మోండా మార్కెట్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికులు స్వయంగా దుకాణాల నుంచి బయటకు పరుగులు తీస్తూ సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. పలువురు సిబ్బంది కలిసి ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను నియంత్రించారు. మంటలు చుట్టుపక్కల దుకాణాలకు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగిన దుకాణంలో ప్లాస్టిక్ వస్తువులు అధికంగా నిల్వ ఉండటంతో మంటలు తీవ్రంగా వ్యాపించాయని అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించే అంశమని చెప్పారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

# ప్రజావాణి ద్వారా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో శాఖల సమన్వయం**

**రెండేళ్లలో 74 శాతం ఫిర్యాదుల పరిష్కారం**

**హైదరాబాద్, డిసెంబర్ 19**




రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి, అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ పనిచేస్తున్నామని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బేగంపేటలోని ప్రజాభవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రజావాణి రెండో వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజావాణి ఇన్‌ఛార్జ్‌లు, అధికారులు పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులు ప్రజావాణి ద్వారా తమ సమస్యలు ఎలా పరిష్కారమయ్యాయో ఈ సందర్భంగా వివరించారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజావాణి ప్రారంభించిన రెండేళ్లలో ఇప్పటివరకు 74 శాతం ఫిర్యాదులను పరిష్కరించినట్లు వెల్లడించారు. ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు చేస్తున్న ప్రచారం పూర్తిగా దుష్ప్రచారమేనని ఆయన ఆక్షేపించారు. ఎన్ని విమర్శలు వచ్చినా ప్రజల సమస్యలపై ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టంచేశారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు సాంకేతికతను ఉపయోగిస్తున్నామని తెలిపారు. ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ సహాయంతో వివిధ శాఖల మధ్య సమన్వయం పెరిగిందని చెప్పారు. దీనివల్ల సమస్యల పరిష్కారంలో ఆలస్యం తగ్గిందని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అధికారానికి దూరమైన బీఆర్ఎస్ ఎన్ని విమర్శలు చేసినా తాము ప్రజల పక్షానే ముందుకు సాగుతామని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలోని వనరులు ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రజావాణిని విజయవంతంగా అమలు చేస్తున్న అధికారులు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.

# బోండీ బీచ్ కాల్పుల ఘటనపై తెలంగాణ డీజీపీ స్పష్టత

**సాజిద్ అక్రమ్‌కు హైదరాబాద్ మూలాలున్నా సంబంధం లేదని వెల్లడి**

**హైదరాబాద్‌కు ఉగ్రదాడితో ఎలాంటి అనుబంధం లేదు**

**హైదరాబాద్, డిసెంబర్ 19 :**



ఆస్ట్రేలియాలోని బోండీ బీచ్‌లో జరిగిన కాల్పుల ఘటనకు హైదరాబాద్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. కాల్పులకు పాల్పడిన సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌కు చెందినవాడే అయినప్పటికీ, అతడి వ్యక్తిగత నేపథ్యం తప్ప ఈ ఉగ్ర ఘటనతో నగరానికి ఎలాంటి అనుబంధం లేదని ఆయన తేల్చిచెప్పారు. ఈ ఘటన నేపథ్యంలో సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలకు తావు లేదని డీజీపీ పేర్కొన్నారు. సాజిద్ అక్రమ్ పాతబస్తీకి చెందినవాడని, 1998లో ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆస్ట్రేలియా వెళ్లినట్లు డీజీపీ వివరించారు. అక్కడే యూరోపియన్ మూలాలున్న వెనెరా గ్రాసో అనే మహిళను వివాహం చేసుకొని శాశ్వతంగా ఆస్ట్రేలియాలో స్థిరపడ్డాడని తెలిపారు. చదువు, ఉపాధి కారణంగా అతడి జీవితం ఎక్కువగా ఆస్ట్రేలియాకే పరిమితమైందని చెప్పారు. ఆస్ట్రేలియాకు వెళ్లిన తర్వాత సాజిద్ అక్రమ్ ఆరుసార్లు భారత్ వచ్చినట్లు డీజీపీ వెల్లడించారు. వివాహం అనంతరం భార్యతో కలిసి ఒకసారి హైదరాబాద్‌కు వచ్చాడని, ఆ తర్వాత 2004, 2009, 2011, 2016లో భారత్‌కు వచ్చినట్లు తెలిపారు. 2016లో ప్రాపర్టీ సెటిల్‌మెంట్ కోసం హైదరాబాద్ వచ్చిన సాజిద్, 2022లో చివరిసారిగా తల్లి, సోదరిని చూడటానికి వచ్చాడని వివరించారు. బోండీ బీచ్‌లో జరిగిన ఈ కాల్పుల ఘటనలో మొత్తం 16 మంది మృతి చెందినట్లు సమాచారం అందిందని డీజీపీ తెలిపారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, అంతర్జాతీయ స్థాయిలో విచారణ కొనసాగుతోందని చెప్పారు. హైదరాబాద్ పేరు ఈ ఘటనతో అనవసరంగా జత చేయవద్దని, ప్రజలు శాంతియుతంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నిజాంపేటలో 13 ఎకరాల ప్రభుత్వ భూమి రక్షణ

**- రూ.1300 కోట్ల విలువైన భూమి కాపాడిన హైడ్రా**

**- అక్రమ షెడ్డుల తొలగింపు, ఫెన్సింగ్ ఏర్పాటు - రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, డిసెంబర్ 19**

బాచుపల్లి మండలం నిజాంపేట గ్రామ పరిధిలోని 13 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు శుక్రవారం కాపాడారు. ఈ భూమి విలువ దాదాపు రూ.1300 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సర్వే నంబర్లు 186, 191, 334లలో ప్రభుత్వ భూమి అక్రమ కబ్జాకు గురవుతోందని బాచుపల్లి మండల రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా స్పందించింది. రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ పరిశీలనలో సర్వే నంబర్ 334లో ఇప్పటికే నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి అక్రమంగా కబ్జా కావడంతో పాటు అక్కడ శాశ్వత నివాసాలు కూడా ఏర్పడినట్లు నిర్ధారించారు. నివాసాల జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న ప్రభుత్వ భూమిని రక్షించడమే లక్ష్యంగా చర్యలు తీసుకున్నారు.

మిగిలిన 13 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఏర్పాటైన తాత్కాలిక షెడ్డులను హైడ్రా అధికారులు తొలగించారు. అనంతరం భూమి మొత్తం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, హైడ్రా బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. దీని ద్వారా భవిష్యత్తులో మరిన్ని అక్రమ కబ్జాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని అధికారులు స్పష్టం చేశారు.

అక్రమ కబ్జాలపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు కొనసాగిస్తామని హైడ్రా వెల్లడించింది.

# స్వచ్ఛ నగరం ఒక రోజులో కాదు..

**- ప్రతి రోజు బాధ్యతతోనే సాధ్యం: జీహెచ్ఎంసీ**

**- స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో భాగంగా స్వచ్ఛత ప్రతిజ్ఞలు**

**- పాఠశాలలు, వీధులు, కాలనీల్లో ప్రతిధ్వనించిన శుభ్రత సందేశం**

**- సామూహిక బాధ్యతతోనే శుభ్రమైన హైదరాబాద్ సాధ్యం**




**హైదరాబాద్, డిసెంబర్ 19:**

స్వచ్ఛ నగరం ఒక్క రోజులో సాధ్యం కాదని, ప్రతి రోజు పౌరుల బాధ్యతతోనే అది సాధ్యమవుతుందని జీహెచ్ఎంసీ స్పష్టం చేసింది. **SwachhSurvekshan** 2025లో భాగంగా శుక్రవారం నగరవ్యాప్తంగా నిర్వహించిన స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమాలు ఈ సందేశాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాయి. పాఠశాలలు, వీధులు, కాలనీల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, స్థానికులు, స్వచ్ఛత సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్న వయస్సులోనే శుభ్రత అలవాట్లు అలవరుచుకోవడం ఎంత ముఖ్యమో, ప్రజా స్థలాల పట్ల గౌరవం, అవగాహన, సామూహిక బాధ్యత ఎలా నగర రూపును మార్చగలవో ఈ కార్యక్రమాలు గుర్తు చేశాయి. నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను తిరిగి శుభ్రంగా మార్చుకునే దిశగా ప్రజలు ముందుకు రావడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ పౌరులకు కొన్ని సరళమైన కానీ కీలకమైన సూచనలు చేసింది. చెత్తను తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లలో వేయాలని, రోజూ జీహెచ్ఎంసీ స్వచ్ఛ ఆటోలకు చెత్తను అందించాలని, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లలో చెత్త వేయరాదని సూచించింది. వీధులు, ఫుట్‌పాత్‌లు, ప్రజా స్థలాలను శుభ్రంగా ఉంచాలని, తడి పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, చెత్త ఉత్పత్తిని తగ్గించి పునర్వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరింది. ఈ చిన్న చిన్న, కానీ నిరంతర చర్యలతోనే నగర పరిశుభ్రతను కాపాడుకోవడంతో పాటు పర్యావరణాన్ని రక్షించవచ్చని అధికారులు తెలిపారు. శుభ్రమైన, ఆరోగ్యకరమైన హైదరాబాద్ కోసం ప్రతి పౌరుడు భాగస్వామిగా మారాల్సిన అవసరం ఉందని జీహెచ్ఎంసీ స్పష్టం చేసింది. ప్రజల సహకారంతో స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యాన్ని సాధిస్తామని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# అక్రమ బెట్టింగ్ యాప్‌ల వెనుక నేర నెట్‌వర్క్

**- తెలంగాణ పోలీసుల హెచ్చరిక - బెట్టింగ్ యాప్‌లు నేరాలకు ద్వారాలు**

**- రాష్ట్రాల మధ్య విస్తరించిన పోలీసుల కఠిన చర్యలు - అక్రమ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు సూచన**

**హైదరాబాద్, డిసెంబర్ 19:**




అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల వెనుక భారీ నేర నెట్‌వర్క్ పనిచేస్తోందని తెలంగాణ పోలీసులు ప్రజలను హెచ్చరించారు. ఆకర్షణీయమైన లాభాల పేరుతో యువతను, సామాన్యులను మోసగిస్తూ ఈ యాప్‌లు ఆర్థిక నేరాలు, మోసాలు, సైబర్ నేరాలకు దారితీస్తున్నాయని స్పష్టం చేశారు. అక్రమ బెట్టింగ్ యాప్‌లపై తెలంగాణ పోలీసుల కఠిన చర్యలు రాష్ట్రాలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. బెట్టింగ్ ద్వారా సంపాదన అన్నది భ్రమ మాత్రమేనని, చివరకు బాధితులు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర నష్టానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ యాప్‌ల వెనుక సంఘటిత నేర ముఠాలు ఉండి, మనీ లాండరింగ్, డేటా దుర్వినియోగం వంటి నేరాలకు పాల్పడుతున్నాయని వెల్లడించారు. అక్రమ బెట్టింగ్‌ను ప్రోత్సహించడం, ప్రచారం చేయడం కూడా చట్టరీత్యా నేరమేనని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియా, డిజిటల్ వేదికల్లో బెట్టింగ్ యాప్‌ల ప్రకటనలను నమ్మవద్దని, వాటికి దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. చట్టబద్ధమైన మార్గాల్లోనే వినోదం, ఆటలను ఆస్వాదించాలని కోరారు. ప్రజలు చట్టం పక్షాన నిలబడి, అక్రమ బెట్టింగ్‌కు మద్దతు ఇవ్వకుండా సహకరిస్తేనే ఈ నేర నెట్‌వర్క్‌లను పూర్తిగా అరికట్టగలమని తెలంగాణ పోలీసులు స్పష్టం చేశారు. అక్రమ బెట్టింగ్‌పై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# డాక్టర్లు లేకుండా వైద్యం ఎలా?

## బస్తీ దవాఖానాల్లో నిర్లక్ష్యంపై హరీశ్‌రావు ఫైర్

- ఆరు నెలలుగా మూడు బస్తీ దవాఖానాల్లో డాక్టర్లు లేరు
- మందుల కొరత, జీతాల బకాయిలపై ఆగ్రహం – వెంటనే వైద్యులు నియమించి సేవలు పునరుద్ధరించాలి

**సిద్దిపేట, డిసెంబర్ 19 :**



బస్తీ దవాఖానాల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ సమీపంలో ఉన్న బస్తీ దవాఖానను శనివారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన, అక్కడ డాక్టర్ లేకపోవడాన్ని గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్లు లేకుండా ప్రజలకు వైద్య సేవలు ఎలా అందిస్తారని అక్కడి సిబ్బందిని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేటలో నాలుగు చోట్ల బస్తీ దవాఖానలు ఏర్పాటు చేశామని హరీశ్‌రావు గుర్తుచేశారు. కేసీఆర్ నగర్‌లోని ఒక దవాఖానను మినహాయిస్తే, కాళ్లకుంట కాలనీ, లింగారెడ్డిపల్లి, ఆర్‌అండ్‌బీ కార్యాలయం సమీపంలోని మూడు బస్తీ దవాఖానాల్లో గత ఆరు నెలలుగా డాక్టర్లు లేరని విమర్శించారు.

మెడికల్ ఆఫీసర్ గది పెచ్చులు ఊడిపోయి, డాక్టర్ కూర్చునే కుర్చీపై దుమ్ము పట్టి ఉండటాన్ని చూసి ఇదేనా బస్తీ దవాఖానల పరిస్థితి అని ప్రశ్నించారు. డాక్టర్లు లేకపోవడమే కాకుండా మందుల కొరత కూడా తీవ్రంగా ఉందని హరీశ్‌రావు ఆరోపించారు. మల్టీ విటమిన్‌లు, లోప్రెమైడ్, లివో సిట్రిజన్, మెటాఫిన్ ఉన్నప్పటికీ, తప్పనిసరిగా ఉండాల్సిన గ్లిమిఫిరైడ్ 2 ఎంజీ మందు అందుబాటులో లేదని తెలిపారు. చిన్నపిల్లలకు అవసరమైన జింక్ సల్ఫేట్ కూడా లేనట్టు తెలిసి ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ రాడు, మందులు లేవు.. అలాంటప్పుడు ప్రజలకు వైద్యం ఎలా అందుతుందని నిలదీశారు. పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానలను కాంగ్రెస్ ప్రభుత్వం సుస్తీ దవాఖానలుగా మార్చిందని హరీశ్‌రావు విమర్శించారు. ఒకవైపు ఆరు నెలలుగా డాక్టర్లు రావడం లేదని, మరోవైపు అటెండర్‌కు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, స్టాఫ్ నర్స్‌కు నవంబర్ జీతం కూడా రాలేదని తెలిపారు. ప్రజా వైద్యంపై నిర్లక్ష్యం వీడాలని, వెంటనే బస్తీ దవాఖనల్లో వైద్యులను నియమించి, సకాలంలో మందులు అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు.

# పోలీస్ స్టేషన్‌లా..? సెటిల్‌మెంట్ కార్యాలయాలా?

## ప్రెస్ ముసుగులో నడుస్తున్న న్యాయ దందా..

### చట్టాన్ని చంపేస్తున్న 'స్టేషన్ పంచాయతీలు'




పోలీస్ స్టేషన్ అనేది చట్టానికి ఆలయం కావాలి. కానీ నేటి వాస్తవం చూస్తే, కొన్ని స్టేషన్‌లు ఆలయాలు కాదుబహిరంగ సెటిల్‌మెంట్ అడ్డాలు. లా అండ్ ఆర్డర్ అమలు చేయాల్సిన ప్రాంగణాల్లోనే, పోలీసులకంటే ముందుగా కొంతమంది ప్రెస్ వ్యక్తులు కూర్చొని పంచాయతీలు చేయడం, కేసులను 'సర్దుబాటు' చేయడం, డబ్బు–పరిచయాల ఆధారంగా తీర్పులు చెప్పడం రాష్ట్రానికే సిగ్గుచేటు. ఇది కేవలం వ్యవస్థ వైఫల్యం కాదువ్యవస్థపై జరిగిన బహిరంగ దాడి.

**చట్టం కాదు- రేటు కార్డే ఇక్కడ రాజ్యం**

విచారణ, కేసు నమోదు, న్యాయ ప్రక్రియ ఇవన్నీ పుస్తకాలకే పరిమితం. వాస్తవంలో మాత్రం కొన్ని స్టేషన్‌ల్లో "ఎంత ఇస్తే అంత పని" అన్న రేటు కార్డు నడుస్తోంది. పోలీస్ అధికారుల ముందు మాట వినిపించక ముందే, కొంతమంది ప్రెస్ మధ్యవర్తుల ముందే కేసులు 'సెటిల్' అవుతున్న ద ృశ్యం చట్టాన్ని అపహాస్యం చేస్తోంది. చట్టం నడవాల్సిన చోట, దళారీ రాజ్యం అడ్డగోలుగా నడుస్తోంది.

> **బాధితుడికి న్యాయం కాదు.. పరిచయాల పరీక్ష..**
> స్టేషన్‌కు వచ్చిన బాధితుడు ఇప్పుడు చట్టం మీద కాదు, పరిచయాల మీదే ఆశ పెట్టుకుంటున్నాడు. "ఎవరిని కలిస్తే పని అవుతుంది?" అన్న ప్రశ్నే మొదట. ఇది న్యాయవ్యవస్థకు వచ్చిన అతిపెద్ద అవమానం. పోలీస్ స్టేషన్ న్యాయ గడప కాదుపరిచయాల మార్కెట్‌గా మార్చేశారు కొంతమంది ప్రెస్ వ్యక్తులు. బాధితుడి కన్నీరు కాదు, సెటిల్‌మెంట్ మాత్రమే ఇక్కడ విలువైనది.

**పోలీసులు రాకముందే ప్రెస్ రెడీ- ఇది ఏ పాలనా ?**

ఉదయం పోలీస్ అధికారి స్టేషన్‌కు అడుగు పెట్టకముందే, కొంతమంది ప్రెస్ మిత్రులు కుర్చీలు ఆక్రమించి ఫోన్లు చేతబట్టి రెడీగా ఉంటారు. ఎవరు వస్తారు? ఏ కేసు? ఎంత 'పంచాయతీ'? అన్నది ముందే డిసైడ్. పోలీస్ స్టేషన్‌ల్లో ఇది కొత్త సంప్రదాయం? అధికారులకంటే ప్రెస్‌కు స్టేషన్‌పై ఎక్కువ హక్కులు న్యాయా? లేక పోలీస్ వ్యవస్థే చేతులెత్తేసిందా?

**మీడియా పేరుతో దందా.. జర్నలిజానికి మచ్చ**

మీడియా పని అక్రమాలను బయటపెట్టడం. అక్రమాలకు మధ్యవర్తిత్వం చేయడం కాదు. స్టేషన్‌ల్లో కూర్చొని పంచాయతీలు చేయడం, కేసులు క్లోజ్ చేయించడం, బెదిరింపులతో 'సర్దుబాటు' చేయించడం జర్నలిజం కాదున్యాయ వేశ్యావృత్తి. కొంతమంది చేస్తున్న ఈ దందా వల్ల నిజాయితీగా పనిచేసే మొత్తం మీడియానే అవమానాల పాలవుతోంది. ఇది జర్నలిజానికి అంటుకున్న నల్ల మచ్చ.

**మంచిర్యాల పతనానికి ప్రత్యక్ష సాక్ష్యం**

తెలంగాణ అంతటా ఈ దుష్ప్రవర్తన ఉన్నప్పటికీ, మంచిర్యాల జిల్లాలో పరిస్థితి మరింత బట్టబయలైంది. అధికారులు ఆలస్యంగా వచ్చినా, కొంతమంది ప్రెస్ మాత్రం కచ్చితంగా టైమ్‌కి హాజరు. ముందే అడ్డాలు, ముందే పంచాయతీలు, ముందే ఆదాయం. పోలీస్ స్టేషన్ అంటే ప్రభుత్వ కార్యాలయం కాదుప్రైవేట్ సెటిల్‌మెంట్ సెంటర్ అన్నట్లుగా ప్రెస్ స్టికర్ వేసుకున్న దళారుల వ్యవహారం కోనసాగుతోంది.

> **స్టేషన్‌లో చట్టం నడవాలా?**
> **లేక ప్రెస్ పంచాయతీలే నడవాలా?**
> ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించకపోతే, రేపు పోలీస్ స్టేషన్‌కు వెళ్లేది న్యాయం కోసం కాదుసెటిల్‌మెంట్ కోసం అన్న భావన శాశ్వతమవుతుంది. అప్పుడు చట్టం కాదు...ప్రెస్ పేరిట జరిగే దందానే కొనసాగుతుంది.

**పోలీస్ మౌనం...**

**అనుమానాలకు బహిరంగ ఆహ్వానం**

ఇవన్నీ పోలీసులకు తెలియకుండానే జరుగుతున్నాయా? లేక తెలిసీ కళ్లుమూసుకున్నారా? రెండింటిలో ఏదైనా అత్యంత ప్రమాదకరమే. పోలీస్ మౌనం అంటే అంగీకారం అన్న భావన ప్రజల్లో బలపడుతోంది. ఇది లా అండ్ ఆర్డర్‌కు మాత్రమే కాదు, పోలీస్ వ్యవస్థ విశ్వసనీయతకు కూడా గట్టి దెబ్బ.

**పార్వతి రాజేష్ కుమార్**
**సీనియర్ జర్నలిస్ట్**

---

# సింగరేణిలో ఉద్దేర మాస్టర్ల రాజ్యం!

**• డ్యూటీ లో లేకుండానే అటెండెన్స్ • అధికారుల ఆశీస్సులతో నడుస్తున్న అక్రమ దందా**

**మందమర్రి ,డిసెంబర్ 19,(మన సమాజం):** సింగరేణి బొగ్గుగనులు కార్మికుల శ్రమకు ప్రతీకగా నిలవాల్సినవి. కానీ నేడు అవే గనులు ఉద్దేర మాస్టర్ల మాఫియాకు అడ్డాగా మారుతున్నాయంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థమవుతోంది. డ్యూటీకి హాజరు కాని కార్మికులకు కూడా అటెండెన్స్ వేయడం, ఆ అటెండెన్స్‌కు వచ్చిన జీతాన్ని అధికారులూ–కార్మికులూ పంచుకోవడం నేటి సింగరేణి లో వాస్తవంగా మారింది.

అధికారులను ప్రసన్నం చేసుకుంటే చాలు – ఉద్దేర మాస్టర్‌కు ఒక రేట్ తప్పనిసరి అన్నట్టుగా వ్యవహారం సాగుతోంది. ఒక్కో అధికారి రోజుకు ఐదు నుంచి పది మంది కార్మికులకు మాస్టర్లు వేస్తూ అక్రమంగా అటెండెన్స్ నమోదు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మాస్టర్ల ద్వారా వచ్చే జీతంలో సగం అధికారికి, సగం కార్మికుడికి పంచుకునే వ్యవస్థే ఈ దందాకు మూలమని కార్మిక వర్గాల్లో బహిరంగ చర్చ నడుస్తోంది.
ప్రత్యేకంగా మందమర్రి ఏరియా పరిధిలోని పలు గనుల్లో ఈ అక్రమ వ్యవహారం ఎలాంటి అడ్డంకులు లేకుండా సాగుతున్నట్లు సమాచారం. డ్యూటీకి రాకపోయినా మాస్టర్ పడుతోంది, జీతం డ్రా అవుతోంది, ఆ డబ్బు పంచుకోవడం జరుగుతోంది. ఫలితంగా నిజాయితీగా పని చేసే కార్మికుడు నష్టపోతుంటే, అక్రమ మార్గాన్ని ఎంచుకున్నవాడు లాభపడుతున్న దుర్మార్గమైన పరిస్థితి ఏర్పడింది.




కొంతమంది గని అధికారులు ఈ మాస్టర్ దందాను ఆదాయ మార్గంగా మార్చుకున్నారని తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. రోజుకు పది వేల నుంచి పదిహేను వేల రూపాయల వరకు అక్రమంగా సంపాదించడమే లక్ష్యంగా మాస్టర్లతో ఆటలాడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది కేవలం అక్రమ సంపాదన మాత్రమే కాదు %–% సింగరేణి సంస్థకు, ప్రభుత్వానికి, నిజాయితీ కార్మికులకు జరుగుతున్న బహిరంగ ద్రోహం. ప్రాణాలను పణంగా పెట్టి భూగర్భ గనుల్లో పని చేసే కార్మికుడి చెమట విలువను తక్కువ చేసి, కుర్చీల్లో కూర్చునే అధికారులు అటెండెన్స్‌లతో దందా చేయడం సింగరేణి చరిత్రకే మచ్చగా మారుతోంది. ఈ ఉద్దేర మాస్టర్ల వ్యవహారంపై యాజమాన్యం, విజిలెన్స్, ఉన్నతాధికారులు కళ్ళు మూసుకుంటే, రేపు సింగరేణిలో నిజాయితీ అనే పదానికే అర్థం మిగలదు.

**ఈ అక్రమ ఉద్దేర మాస్టర్లపై చర్యలు ఎప్పుడు?**

లేదా అధికారుల ఆశీస్సులతో ఈ దందా ఇలాగే కొనసాగుతుందా? అనేది కార్మికవర్గంలో ప్రశ్నగా మిగిలింది.

---

# కర్ణాటక సీఎం పీఠంపై స్పష్టత

**పవర్ షేరింగ్ లేదని అసెంబ్లీలో సిద్దరామయ్య ప్రకటన**

**కాంగ్రెస్‌లో అంతర్గత చర్చలు కొనసాగుతున్నాయా?**



**బెంగళూరు, డిసెంబర్ 19**

కర్ణాటక ముఖ్యమంత్రి పీఠంపై గత కొంతకాలంగా కొనసాగుతున్న ఊహాగానాలకు సీఎం సిద్దరామయ్య అసెంబ్లీ వేదికగా తెరదించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో తనకు ఎలాంటి పవర్ షేరింగ్ ఒప్పందం లేదని, పూర్తి ఐదేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం పూర్తి మద్దతు తనకేనని కూడా ఆయన ఈ సందర్భంగా తేల్చిచెప్పారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడిన సిద్దరామయ్య, తాను గతంలో ఒకసారి పూర్తి ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేశానని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యానని, ఈసారి కూడా ఐదేళ్లు కొనసాగుతానన్న నమ్మకం ఉందని చెప్పారు. పదవిని చెరో రెండున్నరేళ్లు పంచుకోవాలన్న నిర్ణయం ఎప్పుడూ జరగలేదని స్పష్టంగా పేర్కొన్నారు. వారం రోజుల వ్యవధిలో ఇదే అంశంపై ఆయన వ్యాఖ్యానించడం ఇది రెండోసారి కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన తర్వాత సీఎం పదవిని సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లు పంచుకుంటారన్న ప్రచారం విస్తృతంగా సాగింది. ఈ ప్రచారం ఆధారంగా మధ్యంతరంగా సీఎం మార్పు జరుగుతుందని డీకే శివకుమార్ వర్గం ఆశలు పెట్టుకుంది. అయితే, తాజా ప్రకటనలతో ఆ అంచనాలపై సిద్దరామయ్య నీళ్లు చల్లినట్లయ్యింది. దీంతో కాంగ్రెస్‌లో అంతర్గత అసంతృప్తి చర్చకు వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో గురువారం రాత్రి మంత్రి సతీశ్ జార్కిహోళి ఇచ్చిన విందుకు సిద్దరామయ్యతో పాటు ఆయనకు సన్నిహితులైన కొందరు మంత్రులు హాజరయ్యారు. ఈ విందుకు డీకే శివకుమార్‌కు ఆహ్వానం అందలేదన్న విషయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే, దీనిపై డీకే శివకుమార్ స్పందిస్తూ విందు భోజనానికి వెళ్లడంలో తప్పేమీ లేదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ అంశం కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ఇరు వర్గాల మధ్య సయోధ్య కోసం చర్చలు జరుగుతున్నాయని, 2028 ఎన్నికల్లో డీకే శివకుమార్‌కు మద్దతిస్తానని సిద్దరామయ్య ప్రతిపాదించినట్లు కూడా రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పేరు మార్పుపై రాజకీయ దుమారం

**12 గంటలపాటు పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాల ధర్నా**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 19**




మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చుతూ తీసుకొచ్చిన బిల్లును పార్లమెంటు ఆమోదించడంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం చెలరేగింది. వికసిత్ భారత్ గ్యారెంటీ రోజ్‌గార్, అజీవిక మిషన్ (గ్రామీణ్)గా, సంక్షిప్తంగా వీజీ%–%జీ రామ్ జీగా పేరుమార్చే బిల్లును ప్రతిపక్షాల నిరసనల మధ్య గురువారం పార్లమెంటు ఆమోదించింది. రాజ్యసభలో అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ బిల్లుకు ఆమోదం లభించింది. ప్రస్తుత ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుపట్టాయి. ఈ నిర్ణయం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించాయి. బిల్లును వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు గురువారం రాత్రంతా పార్లమెంటు ఆవరణలో ధర్నాకు దిగారు. సుమారు 12 గంటలపాటు నిరసన కొనసాగించడం గమనార్హం. కొత్త బిల్లు రైతులు, గ్రామీణ పేదలకు వ్యతిరేకమని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం దేశంలో పేదల జీవనాధారంగా మారిందని, అలాంటి పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించడం దేశ ప్రజల భావోద్వేగాలను గాయపరిచిన చర్యగా అభివర్ణించారు. ఈ నిర్ణయంతో గ్రామీణ కార్మికుల హక్కులు దెబ్బతింటాయని కూడా ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటు ఆమోదంతో బిల్లు చట్టరూపం దాల్చే దిశగా ముందుకెళ్లినా, దీనిపై పోరాటం ఆగదని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ప్రకటించాయి. ఈ అంశం రానున్న రోజుల్లో జాతీయ రాజకీయాల్లో మరింత చర్చకు దారి తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# 29 నుండి జనవరి 2వ తేదీ వరకు

**కపిలేశ్వరాలయంలో తెప్పోత్సవాలు**

**తిరుపతి,డిసెంబరు19:**

తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో డిసెంబరు 29 నుండి జనవరి 2వ తేదీ వరకు తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఐదు రోజులపాటు జరిగే తెప్పోత్సవాల లో మొదటిరోజైన డిసెంబరు 29వ తేదీన శ్రీ వినాయక స్వామివారు, శ్రీ చంద్రశేఖర్ స్వామివారు పుష్కరిణిలో 9 చుట్లు విహరిస్తారు. నవంబరు 30న శ్రీ వళ్ళి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామివారు 9 చుట్లు, డిసెంబరు 31న శ్రీ సోమస్కందస్వామివారు 9 చుట్లు, జనవరి 1న శ్రీ కామాక్షి అమ్మవారు 9 చుట్లు, జనవరి 2న శ్రీ చండికేశ్వరస్వామివారు మరియు శ్రీ చంద్రశేఖర స్వామివారు తెప్పలపై 9 చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు ఊంజల సేవ, తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. జనవరి 3వ తేదీన ఆరుద్ర దర్శన మహోత్సవం సందర్భంగా ఉదయం 6 నుండి రాత్రి 9 గంటల వరకు శ్రీ నటరాజస్వామివారు, శ్రీ శివగామి అమ్మవారు, శ్రీ మాణిక్యవాసగ స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధులలో ఊరేగించనున్నారు.



# సనాతన ధర్మం కాపాడుకోవడం అందరి బాధ్యత

## కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకున్న బాలయ్య, బోయపాటి




వారణాసిలోని కాశీ విశ్వనాథ స్వామిని అఖండ-2 బృందం దర్శించుకుంది. నటుడు నందమూరి బాలకృష్ణ దర్శకుడు బోయపాటి కలసి కాశీని సందర్శించారు. అఖండ 2' చిత్రానికి వస్తున్న అపూర్వ స్పందన నేపథ్యంలో చిత్రయూనిట్‌తో కలిసి బాలయ్య ఆధ్యాత్మిక నగరమైన కాశీకి వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. నేటి తరం సనాతన ధర్మం గొప్పతనాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

'అఖండ 2' సినిమాలో తాను సనాతన సైనికుడిగా నటించానని, ఆ పాత్ర తనకు ఎంతో ఆత్మసంతృప్తిని ఇచ్చిందని బాలకృష్ణ వెల్లడించారు. ఈ సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అనూహ్యమైన స్పందన వస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను నిర్మాతలు, దర్శకుడు కలిసి కలసి సినిమా గురించి వివరించారని బాలయ్య పేర్కొన్నారు. సినిమా సందేశం, సనాతన ధర్మంపై ఉన్న అంశాలు ఆయనను ఆకట్టుకున్నాయని చెప్పారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన 'అఖండ 2' భారీ అంచనాల మధ్య డిసెంబర్ 12న థియేటర్లలోకి వచ్చింది. విడుదలైన తొలి రోజునుంచే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. బాలకృష్ణ అఘోరగా కనిపించిన లుక్, పవర్‌ఫుల్ డైలాగ్స్, మాస్ ఎలివేషన్లు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఫస్ట్ వీక్‌లోనే గట్టి వసూళ్లు సాధించిన ఈ చిత్రం, ఇప్పుడు కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ విజయవంతంగా రన్ అవుతోంది. ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట కలిసి నిర్మించారు. ఎస్.ఎస్. థమన్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. సంయుక్త మీనన్, హర్షాలీ మల్హోత్ర కీలక పాత్రల్లో నటించి కథకు మరింత బలం చేకూర్చారు. 'అఖండ 2' విజయం నేపథ్యంలో కాశీలో స్వామివారి దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని, ఈ సినిమా తన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని బాలకృష్ణ తెలిపారు. ఇది కేవలం తెలుగు సినిమా కాదని, భారతీయులందరి చిత్రమని పేర్కొన్నారు. మంచి సినిమా కోసం చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇప్పటికే హైదరాబాద్‌లో సక్సెస్ ఈవెంట్ నిర్వహించిన టీమ్ ఇప్పుడు ఉత్తరాదిలో సినిమాని ప్రమోట్ చేస్తోంది.

# నిధి అగర్వాల్ పట్ల అనుచిత ప్రవర్తన

## దర్యాప్తు చేపట్టిన పోలీసులు

నిధి అగర్వాల్ గత కొన్ని రోజులుగా టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన పేరు. ఇటీవల హైదరాబాద్‌లోని లూలు మాల్‌లో 'రాజాసాబ్' సినిమా సాంగ్ ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమెకు ఎదురైన చేదు అనుభవం ఇప్పుడు పెద్ద చర్చకు దారి తీసింది. ప్రమోషన్ ఈవెంట్‌కు భారీగా తరలివచ్చిన అభిమానులు నిధి దగ్గరకు చేరుకునేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి అదుపు తప్పింది.

కొందరు హద్దులు దాటి ప్రవర్తించడంతో నిధి తీవ్ర అసౌకర్యానికి గురైనట్లు సమాచారం. ఈ ఘటన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మహిళల భద్రతపై మరోసారి ప్రశ్నలు తెరపైకి వచ్చాయి.పరిస్థితి తీవ్రతను గమనించిన బాడీగార్డులు వెంటనే రంగంలోకి దిగడంతో నిధిని అక్కడి నుంచి సురక్షితంగా బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో నిధి అగర్వాల్‌కు సంబంధించిన పాత వీడియోలు, ఇంటర్వ్యూల్లో చేసిన వ్యాఖ్యలు నెట్టింట మళ్లీ వైరల్ అవుతున్నాయి.

ముఖ్యంగా ఆమె గతంలో కాస్టింగ్ కౌచ్ అంశంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.ఓ ఇంటర్వ్యూలో నిధి మాట్లాడుతూ, సినిమా పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ అనేది 'రాక్షసి లాంటిదని' పేర్కొన్నప్పటికీ, అది తనకు వ్యక్తిగతంగా ఎదురుకాలేదని చెప్పింది. అలాంటి పరిస్థితి వస్తే చాలా బాధగా అనిపిస్తుందని ఆమె స్పష్టం చేసింది. ఇప్పుడు లూలు మాల్ ఘటన తర్వాత ఆమె అప్పటి వ్యాఖ్యలు మరోసారి వెలుగులోకి రావడంతో, అభిమానులు మరియు నెటిజన్లు నిధికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం నిధి అగర్వాల్ డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'రాజాసాబ్'లో కథానాయికగా నటిస్తోంది.

# ఓ మంచి సినిమా ప్రయత్నంలో ఉన్నాం

## డెకాయిట్‌పై అడవి శేష్ కామెంట్

ఆలస్యమైనా ప్రేక్షకులకు మంచి సినిమా అందించాలన్నదే నా తపన. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న 'డెకాయిట్' విషయంలో మేమంతా గర్వపడుతున్నాం అని అడివి శేష్ అన్నారు. ఆయన కథానాయకుడిగా... షానియల్ డియో దర్శకత్వంలో రూపొందుతున్న సినిమానే 'డెకాయిట్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కథానాయకుడు అడివి శేష్ మాట్లాడుతూ ఎక్కడికి పోయాడు? ఏం చేస్తున్నాడు? అంటూ నా గురించి ఎక్స్‌లో చర్చ జరుగుతోంది. నేను ఎక్కడికీ పోలేదు. ఈ సినిమానే చేస్తున్నా. ఇలా చాలా పెద్ద సినిమా. తెలుగు, హిందీ భాషల్లో చేశాం. నేను, షానియల్ కలిసి రాశాం. అనురాగ్ కశ్యప్ మాకు మార్గనిర్దేశనర చేశారు. మృణాల్ అద్భుతమైన నటనని ఇందులో చూస్తారు. ఈ సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందడానికి కారణం నిర్మాత సుప్రియ. సునీల్, జాన్వి ఈ సినిమాని మరింత ముందుకు తీసుకెళుతున్నారు.




ప్రేక్షకుల మనసుల్లో ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్రల్లో నటించడమే నా లక్ష్యం అని అన్నారు. మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ నా మనసుకు దగ్గరైన సినిమా ఇది. హృదయం పెట్టి పనిచేశా. 'సీతారామం' సినిమాని స్వప్నతో, ఇప్పుడు సుప్రియ... మహిళా నిర్మాతలతో కలిసి సినిమా చేయడం చాలా బాగుంది. శేష్ పాత్ర చాలా బాగుంటుంది. ఈ సినిమాకోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 14ఏళ్ల కిందట కాలిఫోర్నియాలో శేష్ అన్నను కలిసినప్పుడు ఒక కథ గురించి మాట్లాడుకున్నాం. అక్కడ మొదలైన ప్రయాణం ఈ సినిమా వరకూ చేరింది. నేను ఈ దేశంలో ఉండటానికి కారణం ఆయనే. ఆయన మార్గనిర్దేశకత్వరలోనే ఈ సినిమా చేశానని అన్నారు.

# మెగా ఫ్యాన్స్‌తో అనిల్ రావిపూడి మీట్ అండ్ గ్రీట్




అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న సినిమా మన శంకర వరప్రసాద్ గారు. నయనతార హీరోయిన్ గా నటిస్తోంది. సంక్రాంతికి వస్తున్నాం తర్వాత అనిల్ రావిపూడి నుండి వస్తున్నా ఈ సినిమాపై ఇప్పటి నుండే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను భారీ చిత్రాల నిర్మాణ సంస్థ ÷న్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి మరియు గోల్డ్ బాక్స్ ఎంట్టంల్గ÷న్మెంట్స్ పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కనుకాగా జనవరి 12న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతుంది మన శంకర వరప్రసాద్ గారు. ఈ నేపథ్యంలో మెగాస్టార్ అభిమానులతో మీట్ అండ్ గ్రీట్ నిర్వహించారు దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి. ఫ్యాన్స్ కి గిఫ్ట్ హ్యాంపర్లు తో పాటు నూతన సంవత్సర క్యాలండర్స్, మనశంకర వరప్రసాద్ టీ షర్ట్స్..పెన్ తో పాటు స్వీట్స్ మరికొన్ని మరికొన్ని బహుమతులు అందజేశారు. సినిమాకు సంబందించిన ముచ్చట్లతో పాటు ఇతర విశేషాలను కూడా ఫ్యాన్స్ తో పంచుకున్నారు మేకర్స్. అలాగే మెగాస్టార్ చిరు నుండి వింటేజ్ కామెడీ సినిమా వచ్చి చాలా కాలం అయింది ఇప్పుడు అలంటి సినిమాను ఇస్తున్నందుకు దర్శకుడు అనిల్ రావిపూడికి అభినందనలు తెలిపారు. వింటేజ్ స్టైల్ చిరు కామెడీ టైమింగ్ కు అనిల్ రావిపూడి మేకింగ్ కలగలిపి మన శంకర వరప్రసాద్ గారు సూపర్ హిట్ అవుతుందని ఫ్యాన్స్ ఈ సినిమా కోసం ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు.